INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN : 2277-7881; IMPACT FACTOR – 4.527; IC VALUE:5.16; ISI VALUE:2.286
VOLUME 6, ISSUE 5(5), MAY 2017

# Aadarsamurthy Tyagaiah (ఆదర్శమూర్తి త్యాగయ్య)

**Dr. G. Jhansi Vani.**
HOD,
Department of Telugu.
Bapatla Arts & Science College,
Bapatla,Guntur District - 522101

భక్తిని సంగీత, సాహిత్యాల ద్వారా ప్రకటించి తాము తరించి అశేష జనులను తరింపచేసిన ఘనకీర్తులు త్యాగయ్య, అన్నమయ్య క్షేత్రయ్య, రామదాసులు. హృదయాన్ని రంజింపజేసి, బుద్ధిని వికసింపచేసి, మానవునికి అత్యుత్తమ సంస్కృతిని చేకూర్చగల లలిత కళలలో సంగీతం ప్రముఖ స్థానం వహిస్తుంది. మనోహర భావాలు, ప్రసన్నపద గుంభనలు గల సాహిత్యం, సంగీతంతో సమ్మేళనం పొందినప్పుడు అది ఆపాతమధురమై హృదయాన్ని స్పందింపజేస్తుంది. తద్వారా మానవుడు సంస్కరింపబడతాడు. బహుశా అందుకే ప్రజలను సంస్కారవంతుల్ని చేయడానికి త్యాగయ్య ఈ మార్గాన్ని ఎన్నుకుని ఉంటాడు.

సంగీత సామ్రాజ్యానికి రారాజైన త్యాగరాజు తమిళ దేశంలోని తంజావూరు జిల్లాకు చెందిన 'తిరువయ్యూరు' (1774-1847) లో జన్మించారు. పరాయిగడ్డపై జన్మించిన త్యాగయ్యకు తెలుగు బాష మీద ఉన్న మమకారం తెలుగువారికి త్యాగరాజు మీద లేకపోవడం దురదృష్టకరం. తెలుగు బాష గానానికి అనుకూలమైన బాష అని ప్రపంచానికే చాటి చెప్పిన త్యాగయ్యకు తెలుగునాట ఆదరణ లేకపోవడం తెలుగు వారమైన మనమందరం సిగ్గుపడాల్సిన విషయం. 24 వేల కీర్తనలతో తన భక్తిని చాటుకోవడంతోపాటు తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవ చేసాడు.

త్యాగయ్య కృతుల్లో ఎంతో లోకజ్ఞత ప్రదర్శితమవుతుంది. మనం నిత్యం చూసే అనుభవించే సంఘటనల్ని అనుభూతుల్ని, స్వభావాల్ని తన కీర్తనల ద్వారా వివరించి మనకు కనువిప్పు కలిగిస్తాడు.

మానవ జీవితాలు ఎలా వ్యర్ధంగా గడుస్తున్నాయనేదాన్ని
నిద్దురచేతగొన్నాళ్ళు విషయ బుద్దుల చేత( గొన్నాళ్ళు
ప్రొద్దున లేచి త్రితాపములను నరులపొగడి పొగడి కొన్నాళ్ళు
ఎద్దురీతి కన్నతావున భుజియించి ఏమి తెలియక కొన్నాళ్ళు
ముద్దుగ దోచే భవసాగరమున మునిగి తేలుచు కొన్నాళ్ళు

మది తప్పిన వృద్ధతనమున ముందు వెనుక తెలియక కొన్నాళ్ళు అంటూ అజ్ఞాన నరుల జీవన గమనాన్ని కళ్ళముందుంచాడు.

అల్పాశ్రమమున గల్గు వెసనములు
కల్పాంతరమైన బోదు; శేష
తల్ప శయనుని నెఱనమ్మిన సం
కల్ప మెల్ల నీడేరును ; మనసా
ధన తరుణుల కాశించునదెల్ల

వెనుక తనువు కలుగుటే గాని
మనసు చేత సేవ్యుని దలచిన సు
మన సత్వము నొసగునే మనసా
గౌరవ హీన ధనికుల గాచుటయు
నేరముల కెడమౌను గాని .............

అంటూ విశ్వజనీనమైన సుఖశాంతులకు రాచబాట చూపించాడు.

త్యాగయ్య నగర వీధుల్లో గానం చేస్తూ "ఉంఛ (యాచక) వృత్తి" చేసి శిష్యులకు, అతిథులకు పెట్టి తాను భుజించేవాడు. తన పవిత్ర జీవనంతో, తపోనిష్ఠతో ప్రజలకు ఆదర్శప్రాయంగా ఉంటూ నిరాడంబరంగా, నిస్వార్థంగా తన జీవితాన్ని గడిపాడు. త్రికరణశుద్ధితో కూడిన భక్తి, సర్వ మానవ సౌభ్రాతృత్వం, వినయం ఆయన భూషణాలు. అందుకే "ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు" అని అనగలిగాడు. అలాగే "దొరకునా ఇటువంటి సేవ" అంటూ తన గురుభక్తిని చాటుకున్నాడు. "తెర తీయగరాదా" అంటూ ఆర్ద్రతతో పాడి స్వామి దర్శనాన్ని పొందగలిగాడు.

ప్రజా సంక్షేమం పట్టని రాజులు కళాకారులకు, కవులకు కానుకలివ్వడం, వాటిని పొందిన పండితులు రాజులను సేవించడం వ్యర్థమని తలిచాడు. రాజాశ్రయాన్ని నిరాకరించాడు. రాజుల ఆధిపత్య విధానాన్ని ఎదిరించాడు.

"కాసిచ్చెడిదే గొప్పయనురా కలిలో రాజులకు
హరిదాసులు సేవింపరనుచు ప్రభువులు దయమానిరి
పరమెంచకపోయిరి" ........

అంటూ గర్హించాడు.

"ధన మదమున నుండు మనుజుల నేను యాచన సేయగ లేనురా" అంటూ ధనంకోసం, సుఖాల కోసం పాటు పడడం అవివేకమంటాడు. ప్రభువులనుండి వచ్చిన కానుకలను, ధనాన్ని నిరాకరించి "నిధి కంటే రాముని సన్నిధి చాలా సుఖమని" తేల్చిచెప్పాడు.

సమాజంలో కుల, బల ప్రాధాన్యంగాక రామభక్త మార్గం ఉత్తమ మైన దంటాడు.

"బలము కులము ఏల రామ–భక్తి కారణము
వెలయు సకల సిద్ధులెల్ల వెంట వచ్చుగాని ........ "

అతికామం, స్త్రీలోలత్వం, పరస్త్రీ సాంగత్యాన్ని నిరసించాడు.

"ఎంత నేర్చినా ఎంతజూచిన
ఎంతవారలైన కాంతదాసులే" అంటూ కాంతదాసత్వం ముక్తి మార్గానికి అవరోధం అంటాడు.

వేదోక్త కర్మలు మనస్సును నిర్మలం చేస్తాయిగాని స్వయంగా ముక్తి నొసంగవు అంటూ బాహ్య పూజకన్నా మానసిక పూజ విశేషఫలప్రదమనే సత్యాన్ని బోధిస్తూ ...

"వేగలేచి నీటమునిగి భూతి బూసి
వేళ్ళనెంచి వెలికి శ్లాఘనీయులై
బాగుగ పైక మార్జన లోలులైరేగాని....

అనే కృతిలో మన జ్ఞాన నేత్రాన్ని తెరిపిస్తాడు.

భక్తి పూర్వకమైన జ్ఞాన నిష్ఠాయజ్ఞానికి ప్రాధాన్యమిచ్చారే గాని పశుహింసతో కూడిన యజ్ఞం సుఖమునీయజాలదన్నారు.

"యజ్ఞాదులు సుఖమనువారికి సమమజ్ఞానులు గలరా.... " అంటూ హింసాయుత భక్తి మార్గాన్ని నిర్వర్ధంగా ఖండించాడు.

ఎన్ని శాస్త్రాలు చదివినా, గృహస్థధర్మాన్ని ఎంతగా పాటించినా ఎవరికైనా మనశ్శాంతి లభించాలి. శాంతగుణం అలవడాలి. లేకపోతే విజ్ఞానానికి శీలనికి అర్థం లేదంటాడు.

శాంతములేక సౌఖ్యము లేదు సారసదళనయన
దాంతునికైన వేదాంతునికైన
దారసుతులు ధన ధాన్యాదులుండిన
సారెకు జపతపసంపద కలిగిన
ఆగమ శాస్త్రములన్నియు జదివిన
బాగుగా సకల హృద్భావము తెలిసిన

అంటూ తత్వబోధనుడైన త్యాగయ్య సామాన్యులకు సైతం అర్థమయ్యేటట్లు బోధించాడు.

తెలుగు భాషలోని సొగసులతో 24 వేల కీర్తనలు రచించి తెలుగుభాష గానానికి అనుకూలమైన భాష అని చాటి చెప్పిన నాద బ్రహ్మయ్య త్యాగయ్య. అక్కడక్కడ భాష ప్రౌఢంగా అనిపించినప్పటికి తెలుగు నానుడులు, లోకోక్తులు, పలుకు బడులు, నుడికారాలను విరివిగా వాడుతూ శాస్త్రాలు, పురాణాలు, ఉపనిషత్తులలో గల తత్త్వరహస్యాలను లలిత పదాలతో సులభంగా గ్రాహ్యమయ్యేటట్లు చక్కటి కృతులతో భక్తి ప్రభోదం గావించాడు త్యాగయ్య. అందుకే త్యాగయ్య సంగీతం ఆపాత మధురమైతే, ఆయన సాహిత్యం ఆలోచనామృతమై సవ్యసాచిలా భక్తుల హృదయంలో తిష్టవేస్తాడు.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. డా॥ పిల్లలమఱ్ఱి రాములు – "భక్తి కవిత్వము"
2. డా॥ యస్. శమంతకమణి – "త్యాగరాజు సంకీర్తనలు – ఒక పరిశీలన"
3. డా॥ భద్రిరాజు కృష్ణమూర్తి – " భాషా సమాజము – సంస్కృతి"

-------

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN : 2277-7881; IMPACT FACTOR – 4.527; IC VALUE:5.16; ISI VALUE:2.286
VOLUME 6, ISSUE 5(5), MAY 2017

# ద్రావిడ భాషల్లో – వంకాయ – పర్యాయ పదాలు

**Dr. G. JANSI VANI,**
**Reader & HOD,**
**Department of Telugu,**
**B.C.A.S., Bapatla.**

ప్రపంచంలో ప్రతిప్రాణికి అత్యవసరమైనవి ఆహార పానీయాలు. అవి కాలాన్ననుసరించి, ప్రాంతీయ దేశీయ భేదాల ననుసరించి, వాతావరణంలో మార్పుల ననుసరించి విభేదిస్తుంటాయి. 'జిహ్వకో రుచి' అన్నట్లు మానవులు తమ తమ రుచుల కనుగుణంగా ఆహార పానీయాలను తయారు చేస్తుంటారు. రుచినో, ఆకారాన్నో, రంగునో ప్రధానంగా గ్రహించి వాటికి పేర్లు పెట్టడం జరుగుతుంది. వీటిల్లో ఏదైతే కొట్టొచ్చినట్లు కన్పిస్తుందో దాన్నే అందరూ ఎక్కువగా గ్రహిస్తుంటారు.

మానవుడు భాషను ఏర్పరచుకున్న తరువాత తనకు సంబంధించిన ఆహార పదార్థాలకు పేర్లు పెట్టుకుని ఉంటాడు కాబట్టి స్వతసిద్ధమైన ఆహార పదార్థాలకు ప్రాచీన కాలంలోనే పేర్లు ఏర్పడి ఉంటాయనేది తథ్యం.

ద్రావిడ భాషల్లో కాయగూరలకు ఆకారాన్ని (పరిమాణం) బట్టి ఏర్పడినంత ఎక్కువగా పేర్లు రుచినిబట్టో, రంగునుబట్టో ఏర్పడలేదనే చెప్పవచ్చు. ఆకారాన్ని బట్టి చిట్టి, పొట్టి, పొడుగు, గుండ్రం, చిన్న, పెద్ద అంటూ వాటి తేడాలను సూచించడం కోసం ఆయా పేర్ల ముందు విశేషణాలను చేర్చడం జరిగిందని స్పష్టమవుతుంది.

భోజ్య పదార్థంగా, వైద్య సహకారంగానే గాక 'గుత్తొంకాయ కూరోయి బావ', 'ఎక్కడయినా బావే గాని వంగతోటలో బావ కాదు' అన్న సరస సంభాషణల్లో సైతం చోటు చేసుకున్న వంకాయకు తెలుగులోనూ, తదితర ద్రావిడ భాషల్లోనూ గల పర్యాయ పదాలను తెలుసుకునే ముందు అసలు పర్యాయ పదాలంటే ఏమిటి ? అవి ఏర్పడడానికి గల కారణాలేమిటన్న విషయాలు తెలుసుకోవడం అవసరం.

"ఒక వస్తువును లేక ఒక అర్థాన్ని సూచించడానికి వేరు వేరు ధాతువుల నుండి ఉత్పన్నమైన రూపాలను పర్యాయ పదాలంటారు". పర్యాయ పదాలు ఉండని భాషంటూ ఉండదు. సాధారణంగా ఒక భాష ఆవిర్భవించినపుడు ఒక వస్తువును సూచించడానికి ఒకే పదం ఉంటుంది. కాని తదర్వాచీన కాలంలో ఆ వస్తువును సూచించడానికి అనేక పర్యాయ పదాలు ఏర్పడవచ్చు. దీనికి ముఖ్య కారణం పర భాషా ప్రభావమని చెప్పొచ్చు. అయితే ద్రావిడ భాషలను పరిశీలించినప్పుడు కొన్ని వస్తువులను సూచించడానికి భిన్న పర్యాయ పదాలు కూడా సజాతీయాలుగానే కన్పిస్తున్నాయి. ద్రావిడ భాషలన్ని ఒకే మూల ద్రావిడ భాష నుండి

ఉత్పన్న మయ్యాయని మనకందరికీ తెలుసు అయినప్పుడు మూల ద్రావిడ భాషలో ఒక వస్తువుకి ఒక పదం ఉన్నప్పుడు అదే పదం తజ్జన్యమైన ద్రావిడ భాషల్లో కూడా వచ్చి చేరాయి. కాని ఈ తత్త్వానికి విరుద్ధంగా ఒక వస్తువుని సూచించడానికి భిన్న ద్రావిడ భాషల్లో అనేక పదాలు కన్పించడమనే విషయం పరిశీలనార్హం. దీనికి కారణాలు ఈ క్రింది విధంగా చెప్పుకోవచ్చు.

(1) మూల ద్రావిడ భాషా సంస్కృతిలో ఆ వస్తువే లేనప్పుడు తదర్వాచీన కాలంలో ఇతర భాషా వ్యవహర్తల దగ్గర నుండి గ్రహించి నప్పుడు ఆ వస్తువును ఆ భాషా పదంతో పాటు స్వీకరించవచ్చు లేదా అంతకు పూర్వమే గల సజాతీయ పదాలతో రూపకల్పన చేయవచ్చు. రూపకల్పన వ్యక్తుల దృష్టిని బట్టి మారుతుంటుంది. పరభాషా పదాలను ప్రయోగించడం గౌరవం, నాగరికమని భ్రమ పడేవారు యథాతథంగా గ్రహిస్తుంటారు. స్వభాషాభిమానులు కొందరు పరభాషా పదాలకు స్వభాషా ప్రత్యయాలను చేర్చి అవి దేశీయమనే అభిప్రాయాన్ని కలుగజేయడానికి తాపత్రయ పడుతుంటారు. కొందరు ఉచ్చారణ సౌలభ్యం కోసం పదాలను విడదీసి, సాగదీసి తమకు తోచిన విధంగా ఉచ్చరిస్తుంటారు.

(2) పూర్వం ఉన్న పదానికి ప్రాచుర్యం తగ్గిపోయినప్పుడు అంటే ఆ వస్తువే కొద్ది కాలం మరుగున పడినప్పుడో, లేక ఒక ప్రాంతానికే పరిమితమై యుండి తరువాతి కాలంలో ప్రాచుర్యం పొందినప్పుడో పర్యాయ పదాలేర్పడడానికి అవకాశం కలుగుతుంది.

(3) అదే విధంగా కాలానుగుణంగా ఆ వస్తువులో భిన్న మార్పులు సంభవించినప్పుడు కూడా పర్యాయ పదాలేర్పడడానికి అవకాశమేర్పడుతుంది. ఆ విధంగా మార్పులు సంభవించి నప్పుడు ప్రత్యేకించిన పేర్లతో పేర్కొనడం జరుగుతుంది. ఈ ప్రత్యేకించిన పదాలు సాధారణంగా సమస్త పదాలుగా ఉంటాయి. కాగా తదనంతర కాలంలో సమస్త పదంలోని ఒక పదమే మార్పు చెందిన, మార్పు చెందని రెండు వస్తువులను సూచించవచ్చు. అప్పుడు అవి రెండూ ఒక దానికొకటి పర్యాయ పదాలవుతాయి.

(4) పదాలకుండే అర్థాలు సంకోచించడమో, వ్యాకోచించడమో జరిగినప్పుడు పర్యాయ పదాలేర్పడే అవకాశముంది.

(5) సమాజంలోని సంస్కృతిలో మార్పులు సంభవించినప్పుడు కూడా పర్యాయ పదాలేర్పడే అవకాశముంది.

ద్రావిడ భాషల్లో వివిధ కాయలను, పండ్లను, దుంపలను, ఆకుకూరలను సూచించడానికి ఏర్పడ్డ పర్యాయ పదాలను పరిశీలించినప్పుడు ద్రావిడ పద వ్యుత్పత్తికోశంలో ‘వంకాయ’ను సూచించడానికి ద్రావిడ భాషల్లో ‘5’ పర్యాయ పదాల రూపాంతరాలు 14 ద్రావిడ భాషల్లో

ISSN : 2277-7881; IMPACT FACTOR – 4.527; IC VALUE:5.16; ISI VALUE:2.286
VOLUME 6, ISSUE 5(5), MAY 2017

కన్పిస్తున్నాయి. అయితే ఈ 14 భాషల్లోనూ పర్యాయ పదాలైదూ ఉన్నాయనుకోవడం పొరపాటు. అన్ని పదాలు అన్ని భాషల్లోనూ ఉండాల్సిన అవసరం లేదు. ఒక వస్తువును (వంకాయను) సూచించడానికి అన్ని భాషల్లోనూ ఒకే పదం ఉండాల్సిన అవసరం లేదు.

(1) *వఌ

తమిళంలో 'వఴుదలై', 'వఴుతునై', 'వఴై', మలయాళంలో వఴుతిన, వఴుతిని, కొడగులో వఌదణ్, తొదలో పొథన్, కన్నడంలో బదణె, బదణి, బదనె, తుళులో బదనె అన్న రూపాలు 'వంకాయ'ను సూచిస్తాయి. ద్రావిడ పదవ్యుత్పత్తి కోశంలో ఈ రూపాలను *వఙ్+ ధాతువుకి సంబంధించిన రూపాలను ఒకే వర్గం (entry) లో చేర్చడం జరిగింది. కాని ఇది సరికాదు. ఈ రెండు రూపాలకు ధాతువులు ఒకటి కాదు. కావున 'వంకాయ' రూపానికి, 'వఴుదలై' రూపాలు పర్యా పదాలవుతాయే గాని రూపాంతరాలు కాజాలవు. ఈ వఴుదలై రూపాలు మూల ద్రావిడ భాషా రూపం *'వఌ'కు సంబంధించినవి. *వఌ అంటే నున్నని అని అర్థం. వంకాయ నున్నగా నిగనిగలాడు తుంటుంది. కావున ఈ అర్థాన్ని సూచించే ఈ పదాలు పై ద్రావిడ భాషల్లో చోటు చేసుకుని ఉండవచ్చు.

మూల ద్రావిడం *వ కారం కన్నడ, తుళు, కొడగు భాషల్లో 'బ' కారంగాను తొదలో 'ప' కారంగానూ మార్పు చెందుతుంది. కావున కన్నడంలో 'వఴుదనై' – 'బఴుదనై' గా మార్పు చెందింది. మూలద్రావిడ 'ఴ' కార ప్రయోగం తమిళ మలయాళ భాషలలో తప్ప తక్కిన ద్రావిడ భాషల్లో లోపించడం చేత 'బఴుదనై' లోని 'ఴ' కారం లోపించి 'బదనె' అన్న రూపం నిలిచి ఉండవచ్చు.

(2) *తూత్

మూలద్రావిడ *తూత్ అన్న ధాతువు నుండి ఏర్పడ్డ తూతు, తూతువళై, తూతుని, తూతునై అన్న తమిళ భాషా రూపాలు, 'తూతువళం' అన్న మలయాళ భాషలోని రూపం 'వంకాయ' ను సూచిస్తున్నాయి. "*తూత్" అంటే గులకరాయి అని అర్థం. ప్రాచీన కాలంలో వైదానికి ఉపయోగించే ఈ వంకాయలు చిన్న గులకరాయంత ఆకారంలో ఉండడమే కాకుండా గులకరాళ్ళలా నునుపుదనాన్ని కూడా కలిగుంటాయి. ఆ కారణం చేత చిన్న గులకరాయి అన్న అర్థంలో మూలద్రావిడ *తూత్ ధాతు నిష్పన్నరూపాలుగా ఈ పదాలు ఏర్పడి ఉండవచ్చు.

(3) *చెట్

కొడగు భాషలో సెద్గ, కుయిలో సొజె, హేజె, కువిలో హేయ రూపాలు వంకాయను సూచిస్తాయి. దీని మూలద్రావిడ రూపం *చెట్ అంటే చెట్టు అని అర్థం. చెట్టుకాయ అన్న అర్థంలోను, రుచికరమైన అన్న అర్థంలోను ఈ రూపాలేర్పడి ఉండవచ్చు. కాయలన్నీ చెట్టుకో,

తీగకో కాసేవే అయినప్పటికి ఈ భాషల్లో వంకాయను ప్రత్యేకంగా చెట్టుకాయ అని పేర్కొనడంతో గల ఆంతర్యం ఏమిటనే విషయంపై ఇంకా పరిశోధన చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

(4) *కాత్

మూల ద్రావిడ *కాత్ ధాతు నిష్పన్న రూపాలుగా పర్జీ భాషలో 'కాకండి', గదబలో 'కాకల్' అన్న రూపాలు వంకాయను సూచిస్తున్నాయి. మూలద్రావిడ భాషలో *కాత్ అంటే నలుపు అని అర్థం. ముదురు ఊదారంగులో ఇంచుమించు నల్లని రంగును కలిగిన కాయ అనే అర్థంలో ఈ పేరు ఆయా భాషల్లో ఏర్పడి ఉంచవచ్చు.

(5) *వఙ్క్

ద్రావిడ పద వ్యుత్పత్తి కోశమందు తమిళంలో వంకయ్, వంకణమ్; తెలుగులో వంగ, వంకాయ; కొలామి, నాయకి భాషల్లో వంగె; పెంగొలో వాంగె; మాల్తోలో బతంగో అనే రూపాలు కన్పిస్తున్నాయి. బి. చౌధురి తన 'వెజిటబుల్స్' అన్న గ్రంథంలోనూ, ఆల్బర్ట్ ఫ్. హిల్ తన 'ఎకనామికల్ బాటనీ' అన్న గ్రంథంలోనూ, 'జార్జి విటేకర్' తన 'సదరన్ వెజిటబుల్ క్రాప్స్' అనే గ్రంథంలోనూ వంకాయ భారతదేశానికి చెందిందనే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

భారతదేశంలో ప్రాచీన కాలంలో వంకాయలను తినేవారు కారని, అరబ్బుల ద్వారానే వారికి వంకాయలను తినే అలవాటు అయ్యిందనే వాదం ఒకటుంది. దాన్నిగూర్చి "యాన్‌లవ్‌లోక్" ఇలా అన్నాడు –– *"The egg fruit is probably of Indian origin. But it appears to have been the Arabs who first thought of eating it, and we find mention of it in the works of Avicenna in the fourth century"*. కానీ తమిళ సాహిత్యంలో ప్రాజీన రచనలుగా చెప్పబడే సంగ కాలానికి సంబంధించిన "కలిత్తొగై" (కలి – 56;16) లోనూ, తరువాతి కాలంలో వచ్చిన "నాలడియార్" (నాలడి–264) లోనూ, 'వైద్యమలైయగరాది', 'మూలిగై విరివగరాది', వంటి వైద్య గ్రంథాల్లోనూ వంకాయలు వైద్యానికే కాకుండా తినడానికి కూడా ఉపయోగించేవారని తెలుపబడింది. అయితే అప్పటికే వంకాయల్లో వివిధ రకాలుండడం, అందులో కొన్నింటిని (తూతువళై) కేవలం వైద్యం కోసమే వినియోగించడం జరిగి ఉండడంతో 'అరబ్బులు' పొరబడినట్లు భావించవచ్చు. మొత్తం మీద 'వంకాయ' భారత దేశానికి చెందిన కాయేనని, అనాదిగా భారతీయులు ఆ కాయలు తింటుండేవారనేది నిర్వివాదంశం.

అయితే భారత దేశంలో వ్యవహరింపబడే సంస్కృత భాషలోను 'వంగ', 'వంగన' అన్న రూపాలుండటం చేత అవి కూడా వంకాయనే సూచిచడం చేత వంకాయ ఆర్య భాషా పదమా? లేక ద్రావిడ భాషా పదమా ? అనే సందేహం కలగక మానదు. కానీ ఈ పదస్వరూపాన్ని

* The Vegetable Book -- P.No.: 113.

వ్యాప్తిని గమనించినప్పుడు ఇది ద్రావిడ భాషా రూపమేనని నిర్ధారణ చేయడానికే అవకాశం ఎక్కువగా ఉంది. ఎందుకంటే తెలుగులోని 'వంగ' రూపానికి సంబంధించిన సజాతీయ రూపాలు దక్షిణ, మధ్య, ఉత్తర ద్రావిడ భాషా ఉపకుటుంబాలన్నింటిలోనూ కన్పిస్తున్నాయి. సాధారణంగా స్వభాషా పదాలే అంతటి వ్యాప్తిని పొందగలుగుతాయి. కాబట్టి ఇది ద్రావిడ భాషా పదమే అనడానికి ఎక్కువ ఆస్కారం కనిపిస్తుంది. అయితే దీని మూల రూపం ఏమిటనే ప్రశ్న తలెత్తుతుంది. 'వంకం' అంటే వంగదేశమనే అర్థం ఉంది. భారతదేశంలో మొట్టమొదట వంకాయ 'వంగ' రాష్ట్రంలోనే వుండేదని, ఆ కారణం చేతనే వంగ+కాయ < వంకాయగా ఏర్పడి ఉంటుందని కొందరు ఊహించారు. అమెరికా వంటి దేశాలలో 'బెంగాల్ బ్రింజాల్' అని పేర్కొనడం కూడా ఈ వాదాన్ని సమర్థిస్తున్నట్లుగా తోచవచ్చు. కానీ ఈ కారణం సమంజసంగా లేదు. అమెరికా దేశానికి బెంగాల్ రాష్ట్రం నుండి వంకాయలను ఎగుమతి చేయడం చేత వారు అలా పేర్కొని ఉండవచ్చు. అయినా 'వంగ' రాష్ట్రం పేరు ఏర్పడేందుకు ముందు కొన్ని వందల సంవత్సరాల క్రితమే 'వంకాయ' పేరు ఏర్పడి ఉండవచ్చు. కాబట్టి వంకాయ పదవ్యుత్పత్తికి, వంగ దేశానికి ఎటువంటి సంబంధం లేదనే చెప్పవచ్చు.

వంకాయ తొడిమలు బాగా వంగిన స్థితిలో ఉంటాయి. సాధారణంగా అన్ని కాయగూరల తొడిమలు కొద్దోగొప్పో వంగే ఉన్నప్పటికీ వంకాయకు మాత్రమే ఈ లక్షణం కొట్టొచ్చినట్లు కన్పిస్తుంది. చెట్టు నుండి కోసిన వంకాయలను పరీక్షించి చూస్తే ఈ విషయం మరింత స్పష్టంగా తెలుస్తుంది. కాబట్టి *వంక్ = వంగియుండు అనే అర్థంలో 'వంకాయ'కు వివిధ ద్రావిడ భాషల్లో పేర్లు ఏర్పడినట్లు తెలుస్తుంది.

ద్రావిడ పదవ్యుత్పత్తి కోశంలో సూచించినట్లు వంకాయకు తమిళంలో తూతువళై, వఴుదళంక్కాయ్ అన్న రూపాలే గాక, తదర్వాచీన కాలంలో 'కత్తిరిక్కాయ్' అన్న రూపం కూడా ఉంది. వేసవి కాలమందు వైశాఖమాసంలో కృత్తికాది నక్షత్రాదులందు సూర్యుడుండే కాలాన్ని, 'కత్తిరి' అంటారు. బహుశ మొట్టమొదట 'కత్తిరి' కాలంలోనే వంకాయలు కాస్తుండడం చేతగాని, ఆ కాలంలోనే వంకాయలు ఎక్కువగా కాస్తుండడం చేతను వీటిని 'కత్తిరికాయ' లని పేర్కొని యుండవచ్చు. ఈ విధంగా పేర్కొనడం ప్రాంతాలను బట్టి మారుతుంటుంది. కోనసీమ ప్రాంతంలో కత్తెర (కర్తరి) కాలంలో కాసే కొబ్బరికాయలను 'కత్తెరకాయ' లంటారు. అట్లే చిత్తూరు జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో 'కత్తెర వంగ' అని పేర్కొంటునట్లు తెలుస్తోంది.

పైన చెప్పినవే గాక తమిళంలో కండకత్తిరి, నీట్టు కత్తిరి, ముల్లు కత్తిరి, కరకత్తిరి (నలుపు) అనియు, కన్నడంలో కరియ బదనె (నలుపు), బజ్జి బదనె మెగరు బదనె (లేత) అనియు, తెలుగులో నిడుపు వంగ, చిరి వంగ, మెట్ట వంగ, నీరు వంగ, ఏఱువంగ, వందిటి వంకాయ, గంజి వంకాయ, ములక, కప్రములక, తెల్ల ములక, పెద్ద ములక, పిన్న ములక, నేల ములక అన్న పర్యాయ పదాలు ఆయా భాషల్లో కన్పిస్తున్నాయి. ఈ పేర్లు ఆకారాన్ని బట్టి,

రంగును బట్టి, ప్రాంతాలను బట్టి, తత్వాన్ని బట్టి (లేత, ముదురు, నీరు) ఏర్పడినట్లు వాటి పేర్లను బట్టే సులభంగా తెలుస్తోంది. ఈ విధంగా భాషల్లో గల వివిధ వస్తువుల/పదార్థాల పర్యాయ పదాలను పరిశీలించి, పరిశోధించినప్పుడు అగమ్యగోచరమైన నూతన విషయాల నెన్నింటినో తెలుసుకునే అవకాశముంది.

ఉపయుక్త గ్రంథాలు :

1. George Whitaker Ware - >Southern Vegetable Crops", American Book Company, U.S.A. 1937.
2. Home C. Thompson & William C. Kelly - "Vegetable Crops", Tata McGraw Hill Publishing Company Ltd. (5th Edition).
3. Maclean C.D - "Glossary of Madras Presidency" Asian Educational Services, New Delhi, 1982.
4. Yann Lovelock - "The Vegetable Book", George Auen & Unwin Ltd., Ruskin House, Museum Street, London, 1972.
5. Burrow T & Emeneau M.B - "A Dravidian Etymological Dictionary", Clarendon Press, Oxford, 1984.
6. Albert F. Hill - "Economic Botany".
7. చౌధురి. బి – "వెజిటబుల్స్" (1967); అనువాదం – రాజేశ్వరరావు (కాయగూరలు) 1976, నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా, ఏ–5, గ్రీన్ పార్కు, న్యూఢిల్లీ–16.
8. దొణప్ప, తూమాటి – "వైకృత పదస్వరూప నిరూపణం", ఆచార్య తూమాటి దొణప్ప, మూడు అరవైల పండుగ, అభినందన సమితి సమర్పణ, 1987.
9. చక్రధరరావు, లకంసాని, తెలుగు వ్యుత్పత్తి కోశాలు (సంపుటాలు I-VIII), ప్రధాన సంపాదకుడు. ఆంధ్రా యూనివర్సిటి ప్రెస్సు, వాల్తేరు, విశాఖపట్టణం–530 003 (1978–1989).
10. విజ్ఞాన సర్వస్వము – (మొదటి సంపుటం & ఎనిమిదవ సంపుటం), తెలుగు భాషా సమితి, హైదరాబాద్.
11. బ్రౌన్ సి.పి. – తెలుగు ఇంగ్లీషు నిఘంటువు.
12. సీతారామాచార్యులు బహుజనపల్లి – శబ్దరత్నాకరము, సూర్యరాయుంధ్ర నిఘంటువు.
13. డా॥ జి.ఝాన్సీవాణి – "ద్రావిడ భాషల్లో ఫలశాకనామావళి – భాషాశాస్త్ర పరిశీలనం" (Ph.D. సిద్ధాంత వ్యాసం).